
# పద్మవ్యూహం

మోపిదేవి
దుర్గా ప్రసాదరావు



చేతికున్న వాచీ చూసుకుంటే దరిదాపుగా నాలు గవొస్తోంది. ఎయిర్ ండిషన్డ్ గదిలో ఉండటంమూలంగా యుట ఎండగా ఉందో, లేదో తెలియడం దు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని ళ్ళీ కాగితాల్లో తల దూర్చాను.

ఈ రోజు ప్రొద్దున్నే టూరునుంచి తిరిగి వచ్చాను. ఉన్నట్టుండి గత ఆరు నెలలుగా మా కంపెనీ వస్తువుల అమ్మకాలు మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో పడిపోసాగాయి. వారం రోజుల క్రితం మా కంపెనీ మానేజింగ్ డైరెక్టరు గోకులదాస్ నన్ను పిలిచి, ఆ రెండు రాష్ట్రాలలో ఉన్న మా ఏజెంట్సందరినీ స్వయంగా కలుసుకొని మాట్లాడి రమ్మన్నారు. ఈ వారం రోజులూ క్షణం తీరికలేకుండా తిరిగి వచ్చాను. ఎల్లుండి కంపెనీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్. నేను తెలుసుకున్న విషయాల గురించి రిపోర్టు తయారుచేసి ఆ మీటింగ్‌లో చర్చించాలి.

తయారయిన రిపోర్టు మరోకసారి చదివాను. అన్ని పాయింట్స్ వచ్చాయి., సేల్స్ డిపార్టుమెంటు వాళ్ళ తప్పు ఏమీ లేదనీ, ప్రొడక్షన్ డిపార్టుమెంటు, మార్కెటింగ్ డిపార్టుమెంటు చేసిన కొన్ని పొరపాట్ల వల్ల అమ్మకాలు పడిపోతున్నాయని రిపోర్టు సారాంశం. అమ్మయ్య! సంకురుమియ్యాను మా డిపార్టుమెంటు వేపు రాకుండా చేశాను. తృప్తిగా నవ్వుకుంటూ, పి. ఎ. ను పిలిచి రిపోర్టు పది కాపీలు తయారుచేసి అన్ని డిపార్టుమెంట్సుకీ పంపించమని పురమాయించాను.

తలమీద నుంచి పెద్ద బరువు దిగిపోయినట్టు హాయిగా ఉంది. ఇహ ఈ రోజుకు ఇంటికి పోయి విశ్రాంతి తీసుకుంటు మనుకుంటూండగా టేబుల్ మీది ఫోను మోగింది. యాంత్రికంగా అందుకున్నాను. "హల్లో!"

"అమ్మయ్య! మీరేనా! ... నేను దుర్గను మాట్లాడుతున్నాను. మీరు వెంటనే మెహర్ క్లినిక్‌కు రావాలి!" దుర్గ గొంతు చాలా ఆదుర్దాగా వినిపిస్తూంది.

"ఏమిటి? ఏం జరిగింది? కొంచెం సరిగ్గా చెప్పండి!" మెహర్ క్లినిక్ నుంచి ఎందుకు ఫోన్ చేస్తూందో నా కర్థం కాలేదు.

"ఆయనకు ఇందాక హార్ట్ ఎటాక్ వచ్చింది. హాస్పిటల్‌లో చేర్పించాం. మీరు వెంటనే రావాలి, ప్లీజ్!"

"ఇదిగో, నిమిషంలో బయల్దేరుతున్నాను" అంటూ ఫోను పెట్టేసి, గబగబా కిందకు పరుగెత్తుకుంటూ వెళ్ళి, కారు విద్యాసాగర్ వేపు పోనిచ్చాను.

ఆనందరావుకి అంత అకస్మాత్తుగా గుండెనొప్పి రావడ మేమిటి? నాకు తెలిసినంతవరకూ వాడిది చాలామంచి ఆరోగ్యం. చక్కగా దబ్బపండు ఛాయలో ఆరడుగుల

ఎత్తున ఉండి బలంగా ఉంటాడు. చెడు అలవాట్లు కూడా ఏమీ లేవే వాడికి— అప్పుడప్పుడు బుడ్డి సేవించడం తప్ప.

ఆనందరావూ, నేనూ ఆంధ్రా యూనివర్శిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు సహాధ్యాయులం. వాడు ఫుట్‌బాల్ టీము కాప్టెనయితే, నేను హాకీ కాప్టెన్. అప్పుడప్పుడూ ఇద్దరం జోలారుపేట నుంచి సప్లయి చేయబడిన విస్కీ రహస్యంగా కొట్టేవాళ్ళం. బుడ్డి దగ్గర స్నేహం పుటం వేసినా మరి పోదంటారు. 'ఏరా' అంటే 'ఏరా' అనుకొనే దాకా వచ్చింది మా స్నేహం.

ఆలోచనల్లోంచి తేరుకోకముందే క్లినిక్ వచ్చేసింది. ఈ హాస్పిటల్ నాకు కొత్తేమీ కాదు. ఇంతకుముందు మా మానేజింగ్ డైరెక్టర్ కూతురికి రహస్యంగా కడుపు తీయించాల్సి వచ్చినప్పుడు ఇక్కడే చేర్పించారు. అప్పుడు ఒకటి రెండు సార్లు వచ్చాను. హాల్లో రోజ్‌వుడ్ బల్ల దగ్గర ఉన్న ఆంగ్లో ఇండియన్ గర్ల్ దగ్గర కెళ్ళి ఆనందం ఉండే గది నెంబరు తెలుసుకొని అటువేపు చకచకా వెళ్ళాను.

గది గుమ్మం దగ్గరే ఎదురుపడింది దుర్గ. జుట్టంతా రేగిపోయి, మొహం అంతా కన్నీళ్ళ చారికలు లేకపోయినా, మనిషి చాలా దిగులుగా ఉంది. కళ్ళు లోపలికి పీక్కుపోయాయి. 'ఏమిటి?' అన్నట్టుగా ఉన్న నా చూపుల్ని అర్థం చేసుకొని చెప్పడం మొదలెట్టింది దుర్గ.

"నిన్నటివరకూ బాగానే ఉన్నారు. ఈ రోజు ప్రొద్దున్నే లేచి వంట్లో బాగో లేదని ఆఫీసుకు ఫోనుచేసి రానని చెప్పి పడుకున్నారు. తర్వాత మధ్యాహ్నం భోజనం కూడా చేశారు. దరిదాపుగా రెండు గంట లయేసరికి గుండె పోటు వచ్చి పడిపోయారు. వళ్ళంతా చెమటలు పోసి, ఊపిరాడకుండా బాధపడడం ప్రారంభించారు. నా కేమో కాళ్ళూ చేతులూ ఆడలేదు. పక్కింటి వాళ్ళు వచ్చి డాక్టరుకు, ఆఫీసుకు ఫోను చేశారు. వాళ్ళంతా కలిసి హాస్పిటల్‌లో చేర్చారు." ఖంగారు ఖంగారుగా చెప్పేస్తున్న దుర్గను ఆపాను.

"ఇప్పు డెలా ఉంది?"

"ఏవేవో ఇంజెక్షన్లు ఇచ్చారు. నొప్పి కొంచెం తగ్గిందని పడుకున్నారు."

ఆనందంతోపాటు పనిచేసే వాళ్ళ కంపెనీ ఆఫీసర్లను దాటుకుంటూ గది లోకి దారి తీశాను. చప్పుడు వినిపించి, కళ్ళు విప్పి చూసి నీరసంగా నవ్వాడు ఆనందం. దగ్గరగా వెళ్ళాను.

ఆ పరిస్థితుల్లో ఎలా మాట్లాడాలో, ఏమి మాట్లాడాలో తెలియలేదు నాకు. అందుకని నిశ్శబ్దంగా కూర్చున్నాను. ఆనందం మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. 'ఫరవాలేదు, చాలాసేపు కూర్చున్నాను' అనిపించాక, లేచి గది బయటకు వచ్చి దుర్గ దగ్గర నిలబడ్డాను.

ఆనందం కొలీగ్స్ మళ్ళీ వస్తామంటూ ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. నేనొక్కడినే మిగిలిపోయాను. దుర్గను అక్కడే ఉండమని చెప్పి డాక్టరు దగ్గరకు వెళ్ళాను.

"మీ వాడి కేమీ ప్రమాదం లేదండి. ఇంతవరకూ జరిగిన పరీక్షల్లో ఏమీ తేల్లేదు. అఫ్‌కోర్సు, ఇంకో రెండు మూడు టెస్టులు చేసి, రిజల్ట్స్ రేపు చెపుతాను. ఏది ఏమైనప్పటికీ, ప్రమాద పరిస్థితి ఏమీ లేదు" అంటూ డాక్టరు ధైర్యం చెప్పాడు. తిరిగి వచ్చి అవే మాటలు దుర్గకు చెప్పాను.

చీకటి పడుతూంది. దుర్గను ఇంటికి వెళ్ళమన్నాను. ఆవిడ కదల్లేదు.

"మీరే ఇలా అధైర్యపడితే ఎలా? వెంటనే ఇంటికి వెళ్ళి కాస్త పిల్లల సంగతి చూడండి. ఇక్కడ వీడి కేమీ లోటుండదు. రాత్రంతా ఒక నర్సు కావలా ఉంటుంది. పైగా డాక్టరు ఎప్పుడూ ఉంటాడాయె! ... మీ రిక్కడే ఉండిపోతే ఇంటి దగ్గర పిల్లలు బెంబేలెత్తిపోరూ?" అంటూ బలవంతంచేసి ఆవిడను లేవదీశాను. మళ్ళీ రే ప్రొద్దున్నే వస్తానని ఆనందంతో చెప్పి, దుర్గను వాళ్ళింటి దగ్గర దించి ఇంటికొచ్చాను.

కాఫీ తీసుకురావడానికి లోపలి కెళ్ళింది అరుణ.

ఆనందం దరిదాపుగా నా వయస్సు వాడే. వాడి కప్పుడే గుండె నొప్పి రావడం ఏమిటి? నా కేమిటో భయంగా ఉంది.

నెల క్రితం రొమ్ములో నొప్పివచ్చినప్పుడు నిద్రలో పట్టిన ఊపిరికుట్టు నొప్పను కొని అశ్రద్ధ చేశాను. ఎందుకైనా మంచిది, ఒక్కసారి డాక్టరు దగ్గరకు వెళ్ళి పరీక్ష చేయించుకుంటే మంచిదేమో? ...

"ఏమిటలామొహంపీక్కుపోయింది?" కాఫీ కప్పుతో వచ్చి పక్కన కూర్చుంది అరుణ.

"సాయంకాలం ఆనందాన్ని చూడడానికి ..." నా వాక్యం పూర్తికానేలేదు— "ప్రొద్దున్నే ఊరునుంచి వచ్చారో, లేదో సాయంత్రానికల్లా ఆనందరావుగారిని చూడ్డానికి వెళ్ళారా? ఇదిగో, ఇప్పుడే చెపుతున్నాను! ఇహనుంచి మీరు అతగాడిని కలుసుకోడానికి వీల్లేదు!" గయ్యిమంటూ లేచింది.



"చాలా ఖరీదైనదా?"



"కాదు. ఇది కమలావారి తయారీ."



తక్కువ ఖర్చుతో
ఎక్కువ చూపులు!
కమలా
నైలాన్ స్ట్రెచ్ కాటన్ ఫేబ్రిక్

CU-A 1299

ఈఅకారణ కోపానికి బిత్తరపోయాను.

"ఈ ఆనందరావు ఎక్కడ దొరికాడండీ మీకు? అయినా, మీకున్న స్నేహితులంతా ఇలాంటి ముదనష్టపు సరుకేనా! అతగాడు స్నేహితుడని చెప్పుకోవడానికి సిగ్గువేయడం లేదూ?" అష్టవంకరలు తిరుగుతూ ఆనందం మీద తనకున్న అసహ్యమంతా ప్రదర్శిస్తోంది అరుణ.

నోరు పెగుల్చుకున్నాను, "వాడేం చేశాడని నీ కంత కోపం?"

"ఏం చేశాడా? అలా ఒక్కసారి బైటకు వెళ్ళి చూడండి, అందరూ అతగాడిని ఎలా తిడుతున్నారో! పైగా 'ఏం చేశాడు' అని సంగనాచిలా నన్నడగడం. మీ స్నేహితుడేగా... అతగా డేం చేస్తున్నాడో, ఏం చేశాడో మీకు తెలియకుండా ఉంటుందా?" అసలు విషయం చెప్పకుండా గంటల తరబడి మాట్లాడడం ఒక్క ఆడవాళ్ళకే, మంత్రులకుమాత్రమే సాధ్యమనుకుంటా!

ఓ గంట పైగానే సాధిస్తూ, గొణుగుతూ అసలు సంగతంతా చెప్పింది అరుణ. ఆనందరావు, వాళ్ళ ఆఫీసులోనే పని చేస్తున్న పద్మ అనే అమ్మాయితో సంబంధం పెట్టుకున్నాడట. ఈ రహస్య ప్రణయ గాథ ఎన్నాళ్ళ నుంచి జరుగుతూందో ఎవరికీ తెలియదట. నాలుగు రోజుల క్రితం పద్మ ఆనందరా వింటికి వచ్చిందట, ఏడు నెలల కడుపుతో. నానా అల్లరీ చేసిందట. ఆనందం దేభ్యం మొహం వేసుకు నిలబడ్డాడుట. మొత్తం మీద ఎలాగైతేనేం ఆ రోజు సాయంకాలాని కల్లా కొంత డబ్బు ముట్టచెప్పి ఆ అమ్మాయిని వదిలించుకున్నారట.

ఆనందానికి అటువంటి పనులు చేతొచ్చునని ఎప్పుడూ అనుకోలేదు. చాలా రోజుల క్రితం పద్మా, వాడూ కలిసి తిరగడం నాలుగైదుసార్లు చూశాను కాని పట్టించుకోలేదు. అయినా వెధవ, చదువుకున్నవాడు కదా, ప్రభుత్వంవారు ప్రచారం చేస్తున్న కుటుంబ నియంత్రణ సాధనాల గురించి తెలియదూ?

అసలు సంగతి ఇప్పుడిప్పుడు అర్థమవుతూంది. ఏకపత్నీవ్రతు డనుకొన్న మొగుడికి మరో ఆడదానితో సంబంధం ఉందని తెలిసిన దుర్గ, నిప్పుమీద ఎంతాయను ఉడికించినట్టుగా ఆనందాన్ని వేధించడం మొదలు పెట్టుంటుంది. ఒక పక్క అవమానం, మరో పక్క పెళ్ళాం గొడవతో మనవాడికి గుండె నొప్పి వచ్చుంటుంది ... అయినా, ఈ ఆడవాళ్ళకు సమయం, సందర్భం ఉండవు. దుర్గ మరీ అంత ఇదిగా సతాయించకుండా ఉంటే ఇంత గొడవ జరిగేది కాదనుకుంటా!

నేను చాలా పక్షపాతంగా ఆలోచిస్తున్నానేమో ననిపించింది. ఇంత ముంచుకొస్తుందని పాపం ఆవిడమాత్రం కలగందా?

ఒక పక్క ఆనందం పరిస్థితి మీద జాలివేసినా, మరో ప్రక్క వాడిమీద కోపంకూడా వచ్చింది నాకు. వాడు ఈ చండాలమంతా చేయకపోతే అరుణ ఈ


# రూపాయల్లను మీరు సమీకరించండి అదృష్టంలో పాలుపంచుకోండి

## భాగ్యలక్ష్మి ఆంధ్రప్రదేశ్ స్టేట్ లాటరీనుంచి అనిర్వచనీయమైన గ్రూప్ పర్చేజ్ పథకం

భాగ్యలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లాటరీ వారు వంద లేక వందలలో టిక్కెట్లు కొంటే 15% రిబేటు ఇస్తారు. టిక్కెట్లు మీరు, మీ మిత్రులు కలిపి ఉమ్మడిగా కొనుక్కొని, ఖర్చును సమంగా భరించవచ్చును. ఒక టికెట్‌గాని అంతకు మించిగాని గెలుపొందిన పక్షంలో బహుమతి మొత్తాన్ని మీలో మీరు పంచుకోవచ్చును.

ఈ పథకం మీకు ఎలా లాభిస్తుందో గమనించండి :

- మీరు బహుమతిని గెలుచుకొనే అవకాశం ఎన్ని టిక్కెట్లు మీరు కొంటే అన్నిసార్లు ఎక్కువ అవుతుంది.
- అధిక సంఖ్యలో టిక్కెట్లు కొనడంవలన ఇచ్చే రిబేటుతో టిక్కెట్ ఖరీదు ఒక రూపాయికంటే తక్కువపడుతుంది.
- టిక్కెట్ల సంఖ్య కంటే టిక్కెట్ల ఖరీదుకు మీకు డబ్బిచ్చే చందాదార్లు ఎక్కువగా వుంటే, టికెట్ ఖరీదు ఇంకా తక్కువ పడుతుంది.

రూపాయిలో కొంత భాగానికి మాత్రమే మీ అదృష్టాన్ని పరీక్షించుకునే ఇలాంటి అద్భుతమైనసదవకాశాన్ని జారవిడుచు కుంటారా?

టిక్కెట్లన్నీ మీకు సమీపంలోవుండే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, ఆంధ్రా బ్యాంక్, లేక సిండికేట్‌బ్యాంక్‌ల ఏ బ్రాంచి నుంచైనా పొందవచ్చును.

ఈ గ్రూప్ పర్చేజ్ పథకం క్రింద కొనే టిక్కెట్లపై ఏజంట్లకు దొరికే బోనసు మాత్రము ఉండదు.

**మొదటి డ్రా : 1974 అక్టోబరు 27**
**బహుమతుల మొత్తం : 16,30,000**
**బహుమతుల సంఖ్య : 18,534**
**బంపర్ బహుమతి : రు. 5,00,000**

నేడే మీ టికెట్ కొనండి
ఎంత ఎక్కువగా కొంటే అంత మంచిది

బహుమతులు ప్రభుత్వముచే గ్యారంటీ చేయబడినవి.

ASP/APSL/74B

**భాగ్యలక్ష్మి**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లాటరీ

గింటా నన్ను సతాయించేది కాదుగదా! ఇటువంటివాళ్ళ వల్లే మగజాతికి చెడ్డ పేరు వస్తూంది.

మెల్లిగా సమయం చూసుకొని ఆనందానికి గుండె నొప్పి వచ్చిందని, అందువల్ల వాడిని చూడ్డానికి హాస్పిటల్‌కి వెళ్ళానని చెప్పాను. ఆ మాట విన్న అరుణ ఒక్క నిమిషం మరేం మాట్లాడ లేదు.

"పైన భగవంతుడు లేడా! చేసిన తప్పుకు వెంటనే శిక్ష వేస్తాడు." నిర్వికారంగా గొణిగింది.

"అన్నట్లు దుర్గా, పిల్లలు బిక్కు బిక్కుమంటూ ఆ ఇంట్లో పడుండాలి కదూ? ... వాళ్ళను ఇక్కడకు తీసుకురాక పోయారా? ... ఈ విషయం కూడా చెప్పాలా?"

దోషిలా నిలబడ్డాను.

"పోనీ ఇప్పుడన్నా బయల్దేరండి. ఇద్దరం కలిసి వెళ్దాం" అంటూ లోపలికి వెళ్ళి చెప్పులు వేసుకు వచ్చింది అరుణ.

బ్రహ్మ ప్రయత్నం మీద దుర్గను ఒప్పించి పిల్లల్నీ, ఆవిడనూ తీసుకు బయలుదేరాం. కారులో వెనకసీటులో కూర్చుని అరుణ ఒడిలో మొహం పెట్టుకొని, "ఆ విషయం మరీ ఇంత ఇదిగా పొగదియ్యకుండా ఉండాల్సింది. దీనికంతా కారణం నేనే! ... ఇప్పుడేమైనా జరిగితే నా గతేమిటి?" అంటూ ఏడుస్తూ చెప్తూంది.

"మరీఅంతగాబెంబేలు పడిపోకుదుర్గా! మేమంతా లేమూ?" అరుణ ఓదార్చు.


"ఆయన ఎప్పుడూ అలాంటి తప్పు పని చేయలేదు. అటువంటిది విధి ఇలా తోసుకు వచ్చింది. పాపిష్టిదాన్ని, గోరంతలు కొండంతలుచేసి ఆయన్ని సాధించి బాధపెట్టాను."

మామూలప్పుడు గంటల తరబడి చెత్త విషయాలు మాట్లాడ గలిగే నాకు, అవసర మొచ్చినప్పుడు బుర్ర మొద్దుబారిపోతుంది. అందుకని ఉలుకూ, పలుకూ లేకుండా కారు డ్రైవ్ చేస్తున్నాను.

• • •

మరుసటి రోజు ప్రొద్దున్నే దుర్గనూ, అరుణనూ వెంటేసుకొని హాస్పిటల్‌కు వెళ్ళాను. గుమ్మంలోనే ఎదురుపడ్డాడు డాక్టరు.

"ఆనందరావుగారికి ఏమీ లేదండి. బహుశా ఆయనకు చాలా మైల్డ్ హార్ట్ ఎటాక్ వచ్చుంటుంది. ఈవేళ సాయంకాలం ఇంటికి తీసుకెళ్ళొచ్చు మీరు. కానీ, కనీసం మరో ఆరు నెలలన్నా చాలా జాగ్రతగా ఉండాలి. మానసిక ఉద్రేకం, అలసట కలక్కుండా చూసుకోవాలి."



ఆవేదనా ? ఆలోచనా ?

చిత్రం— ఎస్. సంపత్ ( మద్రాసు )

డాక్టరు చెప్పేవన్నీ జాగ్రత్తగా వింటూ, తలాడిస్తూంది దుర్గ. అక్కణ్ణించి ఆనందం గదిలోకి వెళ్ళాం. గదిలో మెల్లిగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు వాడు.

మమ్మల్ని చూడగానే దగ్గరగా వచ్చాడు. వాడి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"నారాయణా! దుర్గకు అన్యాయం చేసినందుకు మంచి శిక్ష వేశాడు భగవంతుడు" అంటూ వచ్చి నా చేతులు రెండూ గట్టిగా పట్టుకున్నాడు.

"నాకేమైనా అయితే దుర్గ బాధ్యత, పిల్లల బాధ్యత నీదేరా!"

బావురుమంది దుర్గ. ఆవిడను గది బయటకు తీసుకు వెళ్ళమని అరుణకి సైగచేసి, వాడిని నాలుగు చివాట్లేశాను.

సాయంకాలం వరకూ హాస్పిటల్లో ఉండి ఆనందాన్ని, దుర్గను ఇంటికి తీసుకొని వెళ్ళాను.

* * *

ఆనందం శుభ్రంగా తిరుగుతున్నాడు. మొహంమీద ఎప్పుడూ చిరునవ్వు చెరగకుండా ఉంటూంది. అరుణ కూడా వాడు చేసిన తప్పుడువని క్షమించేసి, "దుర్గ అదృష్టం బాగుంది" అన్న ధోరణిలో పడింది.

ఆ రోజు సాయంకాలం ఒంటరిగా ఇంట్లో కూర్చున్నాను. చెల్లెలి ఇంట్లో ఏదో శుభకార్యం ఉంటే ప్రొద్దున్నే ఊరెళ్ళింది అరుణ.

హఠాత్తుగా ఊడిపడ్డాడు ఆనందం. పరాసరి ఫ్రిజ్ దగ్గరకు వెళ్ళి బిస్కట్ పీసా, రెండు గ్లాసులు తీసుకొచ్చి కూర్చున్నాడు.

"ఆనందం! మరో ఆరు నెలలవరకూ జాగ్రతగా ఉండమని డాక్టరు చెప్పలేదూ? ... నువ్వు తాగొద్దు" అంటూ వారించబోయాను.

"ఏడ్చావులేవోయ్ నువ్వూ, నీ బోడి డాక్టరూనూ! మనకేం ఫర్వాలేదు" అంటూనే గ్లాసెత్తి గడగడ తాగేశాడు. చేసేదేమీలేక నేను ఓ గ్లాసందుకొని కూర్చున్నాను.

"ఒరేయ్, నారాయణా, ఈ దేశంలో పుట్టిన మనం చాలా అదృష్టవంతులం." అప్పుడే నిషా ఎక్కిందేమిటి వీడికి అనుకుంటూ ఆశ్చర్యపోయాను.

"మొగుడికి మరో ఆడదానితో పరిచయం ఉందనీ, ఆ పరిచయం చాలా దూరం పోయిందని తెలిస్తే ఫారిన్ లేడి వెంటనే మొగుడికి విడాకు లిస్తుంది. అవునంటావా, కాదంటావా?"

అవునన్నట్టుగా తలాడించాను.

"నా సంగతి చూడు. ఇప్పుడు మా ఆవిడ నన్నేం అనడం లేదు. హాయిగా కాలం వెళ్ళబుచ్చుతున్నాం. అసలు అటువంటి సంఘటన మా జీవితంలో జరిగిందన్న సంగతి కూడా మర్చిపోయాం!" తెగ వాగేస్తున్నాడు.

"ఏడ్చావులేవోయ్! ఇందులో నీ ఘనతేమీ లేదు. సమయానికి గుండె నొప్పి వచ్చింది కాబట్టి బ్రతికిపోయావు." నవ్వుతూ అన్నాను.

"అదే నేనూ చెప్పబోయేది. పద్మ మా ఇంటికి వచ్చి నానా అల్లరీ చేసిన తరవాత మా ఇంట్లో నాలుగు రోజులు సజీవ నరకం అనుభవించాను. 'తప్పయిపోయింది. క్షమించు, దుర్గా' అనేద్దామనుకున్నాను. కానీ, ఆ మాట అనేస్తే ఇంకేమన్నా ఉందా? జీవితాంతం నన్నో పురుగును చూసినట్టుగానే చూస్తుంది. అవసరం ఉన్నా, లేకపోయినా ఎప్పుడూ ఆ విషయాన్నే కెలికి డొంకే పర్శించిన నరకం సృష్టించగలరు ఆడాళ్ళు. అందుకని ఓ రాత్రంతా కూర్చుని ఈ పద్మవ్యూహం ఛేదించడ మెలా అని ఆలోచిస్తూ, తరతరాలుగా మనలో జీర్ణించుకుపోయిన ఆచారాలు, సాంప్రదాయాలు నెమరు వేశాను. అంతే మరుసటి రోజు గుండెనొప్పి వచ్చి పడిపోయాను."

ఒక్క నిమిషం నాకేం అర్థం కాలేదు.

"అంటే ... నీకు ..." అంటున్న నన్ను ఆపాడు ఆనందం.

"గుండెనొప్పి వచ్చినట్టు నటించాను. అంతే, అంతా పద్మ మరిగిపోయింది!"

తల దిమ్మెక్కినట్లయ్యింది నాకు. గ్లాసులో ఉన్న బ్రాందీ అంతా ఒక్క గుక్కలో మింగాను. *